పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

మాదాపూర్, అక్టోబర్ 16: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు ధర్మతేజ నితీశ్ అన్నారు. డిగ్రీ కళాశాల యాజమాన్యాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరవధిక బంద్‌కు ఏఐఎస్ఎఫ్ పూర్తి మద్దతు ఇస్తుందని తెలియజేస్తూ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో ప్రభుత్వం చర్చలు జరిపి ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించలేని యెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 2వేల మంది విద్యార్థులతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడికి పిలుపునిస్తామన్నారు. డిగ్రీ కళాశాల యాజమాన్యాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరవధిక బంద్‌కు ఏఐఎస్ఎఫ్ పూర్తి మద్దతు అందిస్తుందన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 8వేల కోట్ల స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యార్థులకు ఒకే దఫాలో స్కాలర్‌షిప్స్, రీయింబర్స్‌మెంట్స్ వేస్తామని చెప్పి విద్యార్థులను మోసం చేస్తూ విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం తీరుమార్చుకొని విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని,లేదంటే విద్యార్థులతో కలిసి పెద్దుత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

మౌలిక వసతులు కల్పిస్తాం

ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం ముత్యంరెడ్డినగర్‌లోని సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు.కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యతో పాటు ఇతర వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఆంథోని, రాజేష్‌కుమార్, రామకృష్ణ, సాయికిరణ్, ప్రవీణ్‌కుమార్, రమణచారి, రేఖాదేవి, అను, సునీత పాల్గొన్నారు.-*మల్కాజిగిరి, అక్టోబర్ 16*

వంద శాతం ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యం చేరుకోవాలి

- జడ్సీ ఉపేందర్‌రెడ్డి
- సిబ్బంది క్షేత్రస్థాయిలో మరింతగా కృషి చేయాలి

పన్ను వసూళ్లపై డీసీలు, ఏఎంసీలు, టీఐలు సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

మియాపూర్, అక్టోబర్ 16: బల్దియాలో తగు ప్రాధాన్యత కలిగిన శేరిలింగంపల్లి జోన్‌లో ఆస్తి పన్ను వసూళ్లను అత్యంత పకడ్బందీగా వసూలు చేయాలని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాన్ని గడువులోగా వంద శాతం చేరుకోవాలని ఆదేశించారు. కొన్ని డాకెట్స్‌లలో సాధారణ పురోగతి నమోదవుతున్నదని వాటిల్లో సిబ్బంది మరింత కృషి చేయాలన్నారు. జోన్ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్ల పురోగతిపై డీసీలు, పన్ను విభాగం ఏఎంసీలు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లతో జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి బుధవారం జోనల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ పరిధిలోని శేరిలింగంపల్లి, చందానగర్, యూసుఫ్‌గూడ, పటాన్‌చెరుఆర్‌సీపూర్ సర్కిళ్ల వారీగా ఇచ్చిన లక్ష్యంతోపాటు చేరుకున్న లక్ష్యాన్ని 34 డాకెట్ల వారీగా సమీక్షించారు. అనంతరం జడ్సీ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ. 749.15 కోట్ల లక్ష్యం నిర్ధారణ కాగా, ఇప్పటి వరకు రూ. 299.35 కోట్ల వసూళ్ల లక్ష్యాన్ని చేరుకున్నట్లు పేర్కొన్నారు. వేడుకలు, పలు ఎన్నికలు , పండుగల నేపథ్యంలో కొంత మేర పన్ను వసూళ్ల పురోగతి మందగించిందని, ఇక నుంచి ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని జడ్సీ సూచించారు. ప్రధానంగా శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్లు మరింత పురోగతిని చూపించాలని ఆదేశించారు. కొన్ని డాకెట్లలో పన్ను వసూళ్లు ఆశాజనకంగా లేవని, సంబంధిత ఏఎంసీలు పకడ్బందీ పర్యవేక్షణ చేపట్టి వేగవంతమయ్యేలా చూడాలని జడ్సీ ఉపేందర్‌రెడ్డి ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో అయిదున్నర నెలలే ఉన్నందున ఆస్తిపన్ను వసూళ్ల వంద శాతం లక్ష్యాన్ని గడువులోగానే చేరుకోవాలని స్పష్టం చేశారు. ఇక నుంచి ఈ ప్రక్రియపై నిరంతరం సమీక్షలు చేపడుతామని, అలసత్వం ప్రదర్శిస్తే ఊరుకోబోమని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆస్తిపన్ను వసూళ్లపై అభివృద్ధి పనులు ఆధారపడి ఉన్నందున సిబ్బంది మరింత మెరుగైన పనితీరును కనబర్చాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే ..నగరం ఆరోగ్యం

అల్లాపూర్, అక్టోబర్16 : పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిగి నగర వాసులంతా ఆరోగ్యంగా ఉంటారని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధి పర్వత్‌నగర్ ఫంక్షన్‌హాల్‌లో పారిశుధ్య కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం, పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా చివరి రోజు జోనల్ కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈఎస్ఐ, ఎన్ఐఎన్, సీఎన్ఆర్ వారు కార్మికుల కోసం నిర్వహించిన వైద్య శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అందుకు అనుగుణంగా మందులు కూడా పంపిణీ చేశారన్నారు. అలాగే ప్రతిరోజు మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవన శైలీ సాగించవచ్చన్నారు. ఇప్పటి వరకు జరిగిన అవగాహన కార్యక్రమంలో 2400 మంది కార్మికులు పాల్గొన్నారని, అందులో 1030 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. కార్యక్రమంలో మూసాపేట సర్కిల్ ఉప కమిషనర్ రమేశ్, ఏంహెచ్‌వో కార్తిక్, శ్రీకాంత్‌రెడ్డి, జమీల్, డాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

వందశాతం స్వచ్ఛతను సాధించడమే లక్ష్యం

మూసాపేట సర్కిల్‌లోని అల్లాపూర్‌లో శానిటేషన్ డ్రైవ్‌లో చెట్లకొమ్మలు, వ్యర్థాలను తొలగిస్తున్న కార్మికులు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 16: కాలనీలు, బస్తీల్లో వందశాతం స్వచ్ఛతను సాధించడమే లక్ష్యంగా శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు జంట సర్కిళ్ల డీసీలు రమేశ్, కృష్ణయ్య తెలిపారు. బుధవారం కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్లలో చేపట్టిన శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లను డీసీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్కిళ్లలో శానిటేషన్ డ్రైవ్‌ను చేపట్టినట్టు తెలిపారు. నేటి నుంచి ఈ నెల 22వ తేదీ వరకు శానిటేషన్ డ్రైవ్ కొనసాగుతుందని, మొదటిరోజు కాలనీలు, బస్తీల్లో చెట్ల కొమ్మలు, పనికిరాని వస్తువులను తొలగించడం జరిగిందన్నారు. ఈ డ్రైవ్‌లో భాగంగా రోడ్ల పక్కన పారబోసిన నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారం తొలగించడం జరుగుతుందన్నారు. ఈ డ్రైవ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు వార్డుల వారీగా ఇంజినీరింగ్ విభాగం ఏఈలకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి కాలనీ, బస్తీలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి.. ఆయా కాలనీల్లో నిర్మాణ వ్యర్థాలు, చెత్తచెదారం, చెట్ల కొమ్మలు, ఇతర పనికిరాని వ్యర్థాలను తొలగించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే వందశాతం స్వచ్ఛత సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కార్తిక్, ఎస్‌డబ్ల్యూఎం డీఈ శ్రీనివాస్‌రావు, ఎస్ఆర్‌పీలు, ఎస్ఎఫ్ఏలు ఉన్నారు.

నిర్మాణ వ్యర్థాల నిర్వహణకు స్పెషల్ డ్రైవ్

సమావేశంలో అధికారులు, మున్సిపల్ సిబ్బంది

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 16: నిర్మాణ వ్యర్థాలను సరైన విధానంలో నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు తెలిపారు. ఇందుకోసం కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్టు తెలిపారు. బుధవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాయలంలో అదనపు కమిషనర్ సీఎన్ రఘు నేతృత్వంలో సిబ్బందితో సమావేశం జరిపారు. ఈనెల 23నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు కార్యాచరణ ఉంటుందన్నారు. ఆయా వార్డుల పరిధిలోని మట్టికుప్పలు, నిర్మాణ వ్యర్థాలు తరలించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. జాయింట్ కమిషనర్ వేణుగోపాల్, డిప్యూటీ కమిషనర్లు మల్లారెడ్డి, నర్సింహ, ఏఎంహెచ్‌ఓ కవిత, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించాలి

జేఎన్‌టీయూహెచ్‌లో సదస్సులో జేఎన్‌టీయూ(అనంతపురం) వర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ కె.లాల్‌కిశోర్, వర్సిటీ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్‌రావు, ఉస్మానియా వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ శివరాజ్‌సింగ్, కామాక్షిప్రసాద్, ఉమ తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 16 : సాంకేతిక విద్యా సంస్థలు ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించేలా పని చేయాలని, గ్లోబెల్ మార్కెట్‌లో భారత దేశాన్ని పోటీదారుగా నిలిపేందుకు కృషి చేయాలని జేఎన్‌టీయూ(అనంతపురం) వర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ కె.లాల్‌కిశోర్ అన్నారు. జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ సెమినార్ హాల్‌లో బుధవారం నిర్వహించిన వికసిత్ భారత్ 2047- సాంకేతిక విద్యాసంస్థల పాత్రపై ఒకరోజు జాతీయ సెమినార్‌కు ముఖ్య అతిథులుగా వర్సిటీ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్‌రావు, ఉస్మానియా వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ శివరాజ్‌సింగ్, ప్రొఫెసర్ శివరాజ్, పూర్ణచందర్‌లతో కలిసి కె.లాల్ కిశోర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2047 నాటికి వికసిత భారత్ సాధనలో సాంకేతిక విద్యాసంస్థలు విద్యార్థులను, సమాజాన్ని గమ్యానికి తీసుకెళ్లే అద్దం వలే పనిచేయాలన్నారు. లక్ష్య సాధన కోసం కేవలం విద్యనే కాకుండా మార్గదర్శకత్వాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ వి.కామక్షిప్రసాద్, కోకన్వీనర్ ఉమ, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 16 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో బుధవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) కింది విధంగా ఉన్నాయి.టమాట 47, వంకాయ 35, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జి మిర్చి 85, కాకరకాయ 38, బీరకాయ 38, క్యాబేజి 23, ఫ్రెంచ్ బీన్స్ 85, క్యారెట్ 45, కాలీఫ్లవర్ 23, దొండ 40, చిక్కుడు 65, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 25, క్యాప్సికం 65, ఆలుగడ్డ 37, కీరా 23, దోసకాయ 40, సొరకాయ25, పొట్లకాయ (1) 23, కందగడ్డ 65, ఉల్లిపొరక 55, ఉల్లిగడ్డ 45, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ (1) 8 నుంచి 9, చామగడ్డ 37, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 35, గుమ్మడికాయ 15, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 10 నుంచి 12, పొప్పడికాయ 40గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతు బజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

ఆర్ట్ గ్యాలరీలో ఆకట్టుకున్న చిత్ర ప్రదర్శన



మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో బుధవారం పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ స్కల్ప్చర్ అండ్ పెయింటింగ్ విభాగం విద్యార్థులు ఏర్పాటు చేసిన 'ఏ న్యూ బిగినింగ్' పెయింటింగ్స్, స్కల్ప్చర్, ప్రింట్, ఇన్‌స్టాలేషన్స్ ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకున్నది. ప్రదర్శనలో వర్సిటీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు(16 మంది) వేసిన పలు చిత్రాలతో పాటు ఇన్‌స్టాలేషన్స్, స్కల్ప్చర్స్ ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శన ఈ నెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

- కొండాపూర్, అక్టోబర్ 16

పేదలకు అండగా సీఎం సహాయనిధి

స్వాతి యాదవ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్ , అక్టోబర్ 16 : గచ్చిబౌలి డివిజన్ నానక్‌రాంగూడకు చెందిన భగవాన్ దాస్‌కు అత్యవసర వైద్య సేవల నిమిత్తం సీఎం సహాయ నిధి పథకం ద్వారా రూ.70 వేల ఆర్థిక సాయం నిధుల మంజూరు పత్రాలను పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బుధవారం తన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు సీఎం సహాయ నిధి కొండంత అండగా నిలుస్తున్నదన్నారు. ఈ పథకం సాయంతో పేదలు కార్పొరేట్‌లో ఉచిత వైద్యం పొందుతున్నారన్నారని, అనారోగ్యాలను దూరం చేసుకుని తమ కుటుంబ పోషణలో ముందుకు సాగుతున్నట్లు చైర్మన్ గాంధీ తెలిపారు. ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందిస్తూ సంపూర్ణ భరోసాను కల్పిస్తున్నదన్నారు.

- ఇంటర్నేషనల్ త్రోబాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బ్యాంకాక్‌లో ఈనెల 10 నుంచి 12 వరకు నిర్వహించిన ఇండో థాయ్ ఇంటర్నేషనల్ త్రోబాల్ టెస్ట్ సరిసీ 2024 ఫర్ ఉమెన్ సిరీస్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతి సాధించిన మాదాపూర్ డివిజన్ మాదాపూర్‌కు చెందిన క్రీడాకారిణి ఎర్రగుడ్ల స్వాతి యాదవ్‌ను పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ బుధవారం తన నివాసంలో అభినందించారు. కార్యక్రమంలో మధు యాదవ్, రాజుయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, రవీందర్ గౌడ్, హరికృష్ణ, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడలో వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన

కొత్తగూడలో పూర్తైన బొడ్రాయి ప్రతిష్ఠాపన

కొండాపూర్, అక్టోబర్ 16 : కొత్తగూడ గ్రామంలో బుధవారం బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా శేరిలింగంపల్లి మండల పరిధిలోని కొత్తగూడ గ్రామస్తులు బొడ్రాయి ప్రతిష్ఠాపనను వేద మంత్రాల మధ్య భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా కొనసాగింది. ప్రతిష్ఠాపన మహోత్సం ఉదయం నుంచే ప్రారంభమవ్వగా, దేవతామూర్తులకు ఉష్ణోదక స్నానం, అభిషేకం, మంత్ర, యంత్ర స్థాపన, మూర్తి స్థాపన, పంచామృత అభిషేకం, అలంకరణ, బలులు, స్వచ్ఛ బోనాల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో గ్రామస్తులు కుటుంబ సమేతంగా సందడి చేశారు. నాలుగు రోజులుగా కొనసాగుతున్న ప్రతిష్ఠ మహోత్సవాలు అక్టోబర్ 17వ తేదీన గ్రామ బోనాల ఊరేగింపుతో ముగియనున్నట్లు గ్రామ కమిటీ తెలిపింది.

తవ్వారు.. చేతులెత్తేశారు..

సర్కిల్ కార్యాలయ ఆవరణలో నాలా పరిస్థితి..

శేరిలింగంపల్లి జోన్ చందానగర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో సిల్టుతో పూడుకుపోయిన నాలాను హడావిడిగా తవ్వి వదిలేశారు. నాలా వ్యర్థాలతో నిండి వరద నీరంతా పార్కింగ్ ఏరియాలోకి వస్తుండటంతో గత నెల 23వ తేదీన ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఈ నాలాపై ఉన్న ఇనుప గ్రిల్స్‌ను తొలగించారు. అందులో పేరుకున్న వ్యర్థాలను తీసి రోడ్డు మీదనే వేశారు. అయితే అనూహ్యంగా వారు ఊహించిన దాని కంటే భిన్నంగా నాలా మొత్తం బ్లాక్ కావడంతో అది కాస్తా పెద్ద పనిగా మారింది. దీనిని పూర్తి చేసేందుకు పెద్ద మొత్తంలో నిధులు కావాల్సి రావడంతో.. తవ్విన గుంతను అలాగే వదిలేశారు. ఫలితంగా నిత్యం కార్యాలయానికి పెద్ద సంఖ్యలో వచ్చే ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుంది. ఇలా తవ్వి వదిలేసిన గుంటతో తాజాగా ప్రారంభించిన మహిళా క్యాంటీన్ వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. నిధుల కోసం ఉన్నతాధికారుల కోసం రాసినట్లు అధికారులు చెబుతున్నారు. *- మియాపూర్, అక్టోబర్ 16*

ఎమ్మెల్యేలకు వివాహ ఆహ్వాన పత్రిక అందజేత

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మర్రి మమతరెడ్డిల ఏకైక కూతురు మర్రి శ్రేయారెడ్డి, ఆదిత్యల వివాహం ఈనెల 27న జరుగనున్నది. బుధవారం బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ సురభివాణిదేవిలను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. *- మల్కాజిగిరి, అక్టోబర్ 16*

పేకాట రాయుళ్ల అరెస్టు

కీసర: పేకాట రాయుళ్లను ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఓ అధికార పార్టీ నేత వ్యవసాయ క్షేత్రంలో బుధవారం కీసరకు చెందిన కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం తెలుసుకున్న మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు దాడి చేసి 8 మందిని పట్టుకొని వారి నుంచి రూ. 49,480 నగదు, 6 సెల్‌ఫోన్‌లు, పేక ముక్కలు, 2 కార్లు, 5 బైకేలను నగదు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

శామీర్‌పేట,అక్టోబర్ 16: దీపావళిని పురస్కరించుకుని తుర్కపల్లి గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు బుధవారం తుర్కపల్లి బీజేపీ నాయకులు భవనసి శ్రీనివాస్ దుస్తులు పంపిణీ చేశారు. నాయకులు అశోక్, నర్సింగ్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్వీ ఉత్సవాలు

అల్లాపూర్ డివిజన్ పరిధి సెంట్రల్ అల్లాపూర్‌లోని దర్గా వద్ద గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పండుగలను జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు యోయినోద్దీన్, జమీర్, కరీమ్, అబ్దుల్లా, మస్తాన్‌రెడ్డి, గౌస్, సుంకన్న, ఫణీంద్ర, కుమార్, శివచౌదరి తదితరులు పాల్గొన్నారు.

- అల్లాపూర్, అక్టోబర్ 16

బాలానగర్ సీఐకి శుభాకాంక్షలు



బాలానగర్ సీఐగా బాధ్యతలు చేపట్టిన నర్సింహరాజుకు బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కాండూరి నరేంద్రాచార్య, బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు ఎండీ నసీర్‌లు శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో సీఐ నర్సింహరాజును కలిసి శాలువా కప్పి, పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా దసరా శుభాకాంక్షలు, ముందస్తుగా దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. *- బాలానగర్, అక్టోబర్ 16*

సీఎస్ఆర్ నిధులతో బొంగులకుంట పునరుద్ధరణ

పునరుద్ధరణ అనంతరం బొంగులకుంట చెరువు

దుండిగల్, అక్టోబర్ 16: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో కలిసి బాచుపల్లిలోని బొంగులకుంటను యూఎస్‌టీ పునరుద్ధరించింది. సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ఒకప్పుడు నిస్తేజంగా ఉన్న కుంటను నీటి వనరుగా మార్చి, నిజాంపేట్ కార్పొరేషన్, బాచుపల్లి కేఆర్‌సీఆర్ కాలనీ పరిసర ప్రాంతంలోని 250 ఇండ్లకు ప్రయోజనం చేకూర్చినట్లైందని యూఎస్‌టీ హైదరాబాద్ సెంటర్ హెడ్ వెంకట పేరం పేర్కొన్నారు. ప్రముఖ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్ కంపెనీ యూఎస్‌టీ, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, బాచుపలిలోని కేఆర్‌సీఆర్ కాలనీలో ఉన్న బొంగులకుంటను పునరుద్ధరించడానికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుని పునరుద్ధరించింది. బుధవారం అభివృద్ధిపరిచిన కుంటను ప్రారంభించింది. తద్వారా 250 కుటుంబాలకు ప్రయోజనం బోరునీటి వనరులను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. చెరువు పునరుద్ధరించడంతో పాటు చెరువు చుట్టూ నడక మార్గాన్ని (వాకింగ్ ట్రాక్) అభివృద్ధి చేసింది. దీంతోపాటు పిల్లల పార్కు, వినోదం, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ కోసం కూర్చునే ప్రదేశాలను సైతం ఏర్పాటు చేసింది. చెరువు పునరుద్ధరణలో భాగంగా చెరువు గట్టును పటిష్టం చేయడం, నీటి నిల్వ సామర్థ్యంను మెరుగుపర్చడం వంటి వాటిని ఈ ప్రాజెక్టులో భాగంగా అభివృద్ధి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ చెరువు ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ విజయలక్ష్మీ సుబ్బారావు, యూఎస్‌టీ సెంటర్ హైదరాబాద్ హెడ్ వెంకట పేరం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యూఎస్‌టీ యొక్క సీఎస్ఆర్ టీమ్ సభ్యులు తిరుమల విజయ్ కుమార్, పి.భిక్షపతి ఎండ్ల, సూర్య శేషగిరిరావు ఖండవిల్లి, నరేంద్ర కనకాల, షాహుల్ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గురించి యూఎస్‌టీ హైదరాబాద్ సెంటర్ హెడ్ వెంకట పేరం మాట్లాడుతూ.. సమాజానికి శాశ్వత ప్రయోజనాలను సృష్టిస్తూనే, సానుకూల ప్రభావాన్ని చూపడానికి మార్గం నిర్దేశించుకొని యుఎస్‌టీ ఎల్లప్పుడూ అంకితభావంతో ముందుకు సాగుతుందని అన్నారు. ఈ చెరువు పునరుద్ధరణ కార్యక్రమం కేవలం నీటి సంరక్షణ సమస్యలను పరిష్కరించడానికి మాత్రమే కాకుండా సమాజ శ్రేయస్సు, పర్యావరణ స్థిరత్వాన్ని సైతం మెరుగుపరుస్తుందన్నారు.

PUBLIC NOTICE

The Public in General are hereby by informed that my client Sri Chittiprolu Ramesh, S/o. C.Murali, R/o. P.No. 23, Ramreddy Nagar, Old Bowenpally, Sec'bad entered into an Agreement of Sale with Sri Kasa Sahadev, S/o. K.Narsimhlu Mudiraj, R/o. 7-2-57, Ashok Nagar, Sajanlal Estate, Secunderabad for purchase of Open Plots No. 690 & 691, total admeasuring 400 Sq.yds., forming part of Sy.Nos. 168, situated at Dhoolapally Village, now Dundigal-Gandi Maisamma Mandal, Medchal-Malkajgiri District and also paid substantial amount as advance and earnest money. My client is now contemplating to complete the sale transaction.

If anybody got any right or claim of whatsoever over the said Plot may contact the under signed within Seven days from the date of this notice, failing which my clients shall proceed with the sale transaction and any objection raised thereafter shall deemed to be waived.

M/s M.GOVERDHAN REDDY, G.CHANDRASHEKAR REDDY, R.SAI RAJ REDDY, S.CHANDRAKANTH, Advocates
Address: Plot No. 6, Sri Malani Colony, Tarbund, Secunderabad-9, **Ph.No. 9866118803.**